క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి అనుపమ జేమ్స్

పెద్దవప్పూరు: పీహెచ్‌లో అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా లెప్రసీ ట్యూబర్ క్లోసిస్ అధికారిణి అనుపమ జేమ్స్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె పెద్దవప్పూరు పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు పలుసూచనలు వివరించారు. అలాగే యాడికి మండలంలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యుడు అప్పయ్య గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు తేజస్విని, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రామచంద్ర, సూపర్‌వైజర్ శర్మాష్ వలి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ధ్యేయం



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్

తాడిపత్రి రూరల్: పట్టణ పరిశుభ్రతే ధ్యేయమని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం చిరు వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని దారులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. చెత్త వేసేందుకు బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మునిసిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆదేశించారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శుక్రవారం గుత్తి, పామిడి మండలాలకు చెందిన అంగన్‌వాడీ ఆయాలతో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఆయాలందరూ సమయపాలన పాటించాలన్నారు. ఆయాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విధులు నిర్వహించాలన్నారు. నిబంధనలు తెలుసుకోవడంతోపాటు కార్యకర్తలతో కలిసి ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు నాగేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు



జూదరులతో సీఐ

తాడిపత్రి రూరల్: మండలంలోని వెంకటరెడ్డి సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 15740ను స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులుచేశామన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సచివాలయాల్లోనే మార్పులు, చేర్పులు



మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఆధార్, జనన, మరణ ధ్రువీకరణ మంజూరు సర్టిఫికెట్లలో మార్పులు, చేర్పులు సచివాలయాల్లో చేయాలని ఎడ్యుకేషన్ సెక్రటరీలకు కమిషనర్ జబ్బార్‌మియా సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయాల ఎడ్యుకేషన్ సెక్రటరీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ప్రజలు ఎవరూ మున్సిపల్ కార్యాలయానికి రాకుండా చూడాలన్నారు. సర్టిఫికెట్లలో మార్పులు, చేర్పులు సచివాలయాల్లోనే చేయాలన్నారు. ప్రజలకు సంబంధించిన ఆధార్, డెత్, బర్త్ సర్టిఫికెట్లలో మార్పులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవలకు గ్రహణం

- కూటమి ప్రభుత్వంలో ఆర్బీకేలు నిర్వీర్యం
- నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం

పుట్లూరు: విత్తనం నుంచి పంట విక్రయం వరకూ రైతన్నకు ప్రతి అడుగులో అండగా నిలబడాలనే మహోన్నత ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) నిర్వీర్యమవుతున్నాయి. విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులను రైతులకు అందించడానికి ఆర్బీకేలు ఎంతో ఉపయోపడేవి. ప్రతి ఆర్బీకేలో కియోస్క్ యంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచి ఆన్‌లైన్ ద్వారా రైతన్నలకు కావాలసిన విత్తనాలను, మందులను తెప్పించుకునే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు అక్కడ విధులు నిర్వహించే అధికారులకు సబ్సిడీ విత్తనాల కేటాయింపు నమోదు కోసం మినహా రైతులకు ఉపయోగపడలేదు.

నియోజకవర్గవ్యాప్తంగా 84 కేంద్రాలు

శింగనమల నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 84 ఆర్బీకేలను ఏర్పాటు చేసింది. గతంలో విత్తనాల కోసం మండల కేంద్రాల్లోని వ్యవసాయ కార్యాలయాల వద్ద రైతులు ఉదయం నుంచి పడిగాపులు పడే పరిస్థితి నుంచి ఉన్న గ్రామంలోనే ఆర్బీకేల వద్దకు రైతు సేవలను తీసుకెళ్లడంలో ఆర్బీకేల పాత్ర కీలకంగా మారింది. విత్తనాలు అందించడం, పంటలను కొనుగోలు చేయడం, గిట్టుబాటు ధరలు కల్పించడం లాంటి కార్యక్రమాలు అన్నదాతలకు ఎంతో ఉపయోగపడ్డాయి. కానీ ప్రస్తుతం ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసిన కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. గతంలో ఈ–క్రాప్ బుకింగ్ చేయించామంటే చాలు ఏ సమస్య ఉండదని భావించేలా రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం తోడ్పాటు అందించగా ప్రస్తుతం రైతులే బీమా ప్రీమియం చెల్లించాలనే నిబంధన తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రైతు సంక్షేమం కోసం గత ప్రభుత్వం చేపట్టిన విధంగా ప్రస్తుతం ప్రభుత్వం ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న ప్రతిఒక్కరికీ బీమా ప్రీమియం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రబీలో పంటలను సాగు చేసిన రైతన్నలు డిసెంబర్ 15లోగా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉండగా .. రైతులు ఆర్థిక ఇబ్బందులతో బీమా ప్రీమియం చెల్లించలేకపోతున్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించిన సేవలను ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల ద్వారా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

శింగనమల నియోజకవర్గంలో ఇలా..

మండలం	రైతు సేవా కేంద్రాలు
శింగనమల	12
గార్లదిన్నె	16
బుక్కరాయసముద్రం	14
నార్పల	16
యల్లనూరు	13
పుట్లూరు	13

అన్ని రకాల విత్తనాలు ఇవ్వాలి



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఉచిత పంటల బీమా అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. ఈ ఏడాది యూరియా కొరత ఏర్పడగా రైతు సేవా కేంద్రాల్లో ఇవ్వలేదు. అలాగే అన్ని రకాల విత్తనాలను కేంద్రాల్లో అందించేలా చర్యలు తీసుకోవాలి.

కేశంరెడ్డి చంద్రగోపాల్, చింతలపల్లి

ఉచిత పంటల బీమా కొనసాగించాలి



మండలంలో రబీలో పప్పుశనగ సాగుపై చాలా మంది రైతులు ఆధారపడ్డారు. బీమా లేకపోతే పకృతి వైపరీత్యాల సమయంలో వచ్చే నష్టాన్ని అన్నదాతలు ఎదుర్కోవడం కష్టతరంగా మారుతుంది. అలాంటి పరిస్థితి లేకుండా ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించాలి.

– వెంకట చౌదరి,
ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి

రైతులకు సేవలందిస్తున్నాం



రైతు సేవా కేంద్రాల ద్వారా రబీలో పప్పుశనగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించాం. అలాగే అన్ని కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు వినియోగంలో ఉన్నాయి. రబీలో పంటలను సాగు చేసిన రైతులు డిసెంబర్ 15 లోగా ప్రీమియం చెల్లించాలి. అలాగే పంటలను సాగు చేసిన ప్రతి రైతూ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి.

– కాత్యాయని, ఏఓ, పుట్లూరు

మత్తుకు బానిస కావొద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: మత్తుకు యువత బానిస అయితే బంగారు భవిష్యత్తు చిత్తవుతుందని అప్‌గ్రేడ్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఐటీఐ కళాశాలతో యాంటీ డ్రగ్స్‌పై జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ తెలిసీ తెలియని వయస్సులో యువత చెడు అలవాట్లతో భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలు వమ్ముకానీయొద్దన్నారు. మత్తువల్ల కలిగే అనార్థాలను యువత తెలుసుకొని వాటికి దూరంగా ఉండాలన్నారు.

గ్రామాల్లో పర్యటించిన ఎస్‌ఐ

శింగనమల: మండలంలోని జూలకాల్వ, పి.జలాలపురం, కొరివిపల్లి ,సలకంచెరువు గ్రామాల్లో శుక్రవారం ఎస్‌ఐ శరత్‌చంద్ర పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో కలసి మెలసి ఉండాలని, సమస్యలు వస్తే ఘర్షణలు పడవద్దన్నారు. సమస్యలు పోలీసుల దృష్టికి తీసుకవస్తే న్యాయం చేస్తామన్నారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు.

హెల్మెట్ ధరించండి

యల్లనూరు: ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ శ్రీరాం ప్రసాద్ సూచించారు. శుక్రవారం తిరుమలాపురం క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు లేని ద్విచక్ర వాహనాలకు, కారు, జీపు తదితర వాహనాలకు అపరాధ రుసుం విధించారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం



మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌తో గుత్తి వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు

గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం గుత్తికి చెందిన పలువురు కౌన్సిలర్లు, నాయకులు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుత్తి మునిసిపాలిటీలో నెలకొన్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన ఈ ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కార్యకర్తలు, నాయకులు ఇప్పటి నుంచే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లా పార్టీ బలోపేతం కోసం సైనికుల్లా కష్టపడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం సిగ్గు చేటు అని విమర్శించారు. త్వరలో గుత్తిలో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తల ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ హుస్సేన్‌పీరా, కౌన్సిలర్లు వరదరాజులు, ఫరూక్, రమణ, శివ, నాయకులు క్రషర్ మదుసూదన్‌రెడ్డి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బాగా చదివించాలి

బుక్కరాయసముద్రం: మహిళలు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని ఎంపీడీఓ సాల్మాన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వయోజక విద్యాశాఖ ద్వారా జరిగే నిరంతర విద్యా కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల ప్రతినిధులు, ఆనిమేటర్లు అక్షర జ్ఞానంపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎం నారాయణస్వామి, సీడీపీఓ ఉమా శంకరమ్మ, మండల విద్యా అధికారి లింగా నాయక్, సీసీలు ఈశ్వరయ్య, ఇందిరమ్మ, లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

గార్లదిన్నె: ప్రభుత్వం 104 ఉద్యోగుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 104 ఉద్యోగులు వేతనాలు కోసం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలన్నారు. అలాగే పెండింగ్ ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించి, జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డికి అందజేశారు. డీఈఓ గోపాల్ నాయక్, పైలేట్ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే

యల్లనూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇంటింటా తిరిగి హౌస్ మ్యాపింగ్ , ఇంట్లో ఎంత మంది ఉన్నారు?, ఇంటి యజమానుల ఐరీష్, వేలి ముద్రలను ఆరోగ్య శాఖ ద్వారా ఏఎన్‌ఎంలు సేకరిస్తున్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు సేకరించేవారు. ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో ఆ పనిని ఏఎన్‌ఎంలపై వేశారు. దీంతో అటు పల్లె వాసులకు చికిత్సలు చేయలేక, ఇటు సర్వేలు చేయలేక వారు సతమతమౌతున్నారు.

'ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి'

బుక్కరాయసముద్రం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టడంపై కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వరికూటి కాటమయ్య సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక దోపిడీలు, లిక్కర్ దోపిడీలు, భూ కబ్జాలు, మహిళాపై అత్యాచారాలు, దాడులు పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. బీకేఎస్ జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే లక్ష్మీనారాయణ, నిమ్మల భాస్కర్‌కు నోటీసులు పంపడాన్ని తీవ్రంగా ఖండించారు. అక్రమ కేసులకు వైఎస్సార్ సీపీ పార్టీ భయపడదన్నారు. ఇలాగే కొనసాగితే ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శింగనమల: నియోజకవర్గంలోని పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిధులు మంజూరు కావడంతో శుక్రవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా పలువురికి రూ.6,34,089 మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జిల్లా మొత్తం కరువు ప్రాంతంగా ప్రకటించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

పామిడి: ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, జిల్లా మొత్తం కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేసు, ఏపీ రైతుసంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు తహసీల్దార్ శ్రీధరమూర్తికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అంతటా కరువ ప్రళయ తాండవం చేస్తే ప్రభుత్వం ఏడు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం రైతును నట్టేల ముంచడమే నన్నారు. జిల్లాలోని 31 మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించి నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలన్నారు. అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు అదనపు పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆర్ ముత్యాలు, శంకర, మాబు పాల్గొన్నారు.


పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

యల్లనూరు: మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ పంచాయతీ ప్రణాళికలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12,13న శిక్షణ కార్యక్రమం ఉంటుందని శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 12న పీఆర్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఏపీఎం, వెటర్నరీ అసిస్టెంట్ , వైద్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏఓ, 13న మండలస్థాయిలో ఎంపికైన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల, సర్పంచులకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు.

అపార్ సమస్య పరిష్కరించండి

గుంతకల్లు రూరల్: అపార్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల వివరాల నమోదు కోసం తల్లిదండ్రులు, దివ్యాంగుల ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ హరిత దివ్యాంగులసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ నాయక్ శుక్రవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అపార్‌లో వివరాల నమోదు కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రం చుట్టూ వారాల తరబడి ప్రదక్షిణలు చేస్తున్న తల్లిదండ్రులు సమస్య పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్య త్వరిత గతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నిత్యావసరాల ధరలు అదుపుచేయాలి



ప్రజా పోరు కార్యక్రమంలో మాట్లాడుతున్న రాంభూపాల్

గుంతకల్లు: నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమాన్ని శుక్రవారం గుంతకల్లులో ప్రారంభించారు. స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాముల సర్కిల్ వరకూ దుకాణాల్లో కరపత్రాలు పంపిణీచేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువయ్యాక నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు కనీసం మూడుపుటలా కడుపు నిండా తినే పరిస్థితి కనబడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఉద్యోగాలు కోసం ఎదురు చూసే యువత నిరాశకు గురువుతున్నారు. డీఎస్సీ పరీక్ష వాయిదా పడడంతో పాటు గ్రూప్–1, గ్రూప్–2 పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ఇసుక మాఫియా, మద్యం సిండికెట్లు, కరెంటు చార్జీలు, మహిళలపై దాడులు ఇలా కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యాం చెందిందని దయ్యబట్టారు. జిల్లాలోని సాగునీటి వనరుల అభివృద్ధి కోసం త్వరలో ప్రవేశ పెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7వేలు కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి బీ.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతి ప్రసాద్, కసాపురం రమేష్, నాగరాజు, నాయకులు సురేంద్ర, వైటీసీ రమేష్, తిమ్మప్ప, వెంకీ, జ్యోతి, షాషా తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ?'

తాడిపత్రిటౌన్: ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు ఎక్కడ అంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన తాడిపత్రిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో కాంగ్రెస్ పార్టీ తాడిపత్రి అసెంబ్లీ సమన్వయకర్త నాగిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉచిత గ్యాస్ పథకం క్రింద ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్నది ఏడాదికి రూ.2,684 కోట్లు కాగా కరెంట్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నుండి లాక్కుంటున్నది రూ.6,073కోట్లు అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ప్రతి మహిళకూ నెలకు రూ.1500 పథకాల ఊసే లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు: పట్టణంలోని మార్కెట్ యార్డు, పారిశ్రామిక వాడల్లోని సబ్ స్టేషన్‌ల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా కార్తీక పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శింగనమల: మండల కేంద్రంలోని ఆత్మ సీతారామ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం కార్తీక మాస పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అలయానికి వచ్చిన మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

17న కోటంకలో లక్ష దీపోత్సవం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 17న లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం 6–15 గంటలకు లక్ష దీపోత్సవం, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంరతం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఏఈఓగా పదోన్నతి



విశ్వేశ్వరి

పుట్లూరు: మండలంలోని బాలాపురం గ్రామ సచివాలయం పరిధిలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వేశ్వరికి శింగనమల ఏఈఓగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఏఓ కాత్యాయని, ఏఈఓ హరి, వీఏఏలు, వీహెచ్ఏలు ఆమెను ఘనంగా సన్మానించారు.

సర్టిఫికెట్లు ఉచితం

పామిడి: పట్టణ కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్య సేవలతో పాటు ఆసుపత్రి పరమైన సర్టిఫికెట్లు సైతం ఉచితంగా అందజేస్తామని వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కొందరు వ్యక్తులు ఆస్పత్రి వారి పేర్లు చెప్పి బర్త్, ఇతర సర్టిఫికెట్ల మంజూరుకు అక్రమంగా డబ్బు వసూలుకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. ఫిర్యాదు చేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వృద్ధుడి మృతి

గుత్తి: మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన వృద్ధుడు చిన్న కదిరప్ప(62) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. గత గురువారం గుత్తి పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో చిన్న కదిరప్పను లారీ ఢీ కొంది. గాయపడిన అతడిని మొదట గుత్తి ఆస్పత్రికి అనంతరం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిన్న కదిరప్ప మరణానికి కారణమైన లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసుల ఆధీనంలో ఉన్న మినీ వ్యాన్

గుంతకల్లు: స్థానిక 60 అడుగుల రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టూటౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపిన మేరకు.. గుంతకల్లు పట్టణంతోపాటు సమీపంలోని విడపనకల్లు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజల సేకరించిన బియ్యాన్ని మినీ వ్యాన్‌లో తరలిస్తుండగా స్థానిక 60వ అడుగుల రోడ్డులో పోలీసులు పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని కిలో రూ.10కు కొనుగోలు చేసి, గుత్తి మండలం కరిడికొండకు చెందిన రామచంద్రకు రూ.15కు విక్రయిస్తున్నారన్నారు. సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి సమక్షంలో బియ్యాని తూకం వేయగా 40 క్వింటాళ్ల 10 కేజీలు ఉన్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న గుత్తి ఆర్ఎస్‌కు చెందిన హరిప్రసాద్, కర్నూలు జిల్లా పెరవలికి చెందిన బోయ నగేష్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఓ వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనం అపహరణకు గురైనట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ మాట్లాడుతూ ధర్మవరానికి చెందిన తిరుపాల్ అనే వ్యక్తి కనకదుర్గ గోల్డ్ లోన్ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. తిరుపాల్ విధుల్లో భాగంగా గురువారం మండలంలోని కల్లూరుకు వచ్చి సంజీవరెడ్డి సర్కిల్లో ద్విచక్రవాహనం నిలిపి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.